# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 37 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 11 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :37 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 11 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు




- 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు
- సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన
- కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో

- మిగతా 2లో

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం



- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం

- మిగతా 2లో

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# జగన్‌కు ఈడీ షాక్..

## అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.



## ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

### కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

- ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్
- తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం
- కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు

పెన్ పవర్ డెస్క్:సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని,

- మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

### ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు




- ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం
- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి

- మిగతా 2లో

## గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- తిరుమల గెస్ట్‌హౌస్‌పై కర్ణాటక ప్రభుత్వంతో టీటీడీకి వివాదం
- పవిత్ర స్థలాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపణ
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:తిరుమలలోని కర్ణాటక ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వ్యవహారంపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. వివాదాస్పద నిర్ణయాన్ని కర్ణాటక సర్కార్ వెనక్కి తీసుకోకపోతే, ఆ గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు

- మిగతా 2లో



## ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి.. పోలీసులపై రాళ్ల దాడి

పెన్ పవర్ డెస్క్: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతుంది. జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆందోళనకారులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. అయితే, సీజేపీ ప్రొటెస్ట్?కు అనుమతి లేదంటూ

- మిగతా 2లో



## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు

- మిగతా 2లో

## కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసు కుంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమిళనాడు సీఎం, టీవీకే అధినేత సి. జోసెఫ్

- మిగతా 2లో



## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

పెన్ పవర్ డెస్క్: ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఢిల్లీలో పై 'చేయి' ఎవరిది ?!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతను కాక్రోచెస్ పోల్చడంతో వ్యంగ్యంగా మొదలైన కాక్రోచ్ జనతాపార్టీ నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ లో చేసిన ఆందోళనలతో బలపడింది. సీజేపీ ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న కేంద్రం చివరకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాల్సి వచ్చింది.సర్ ప్రక్రియలో భాగంగా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించిన నేపథ్యంలో ఎన్నికల కమీషన్ లో ఉన్న ఇద్దరు కమీషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ కు ప్రక్రియ కొనసాగుతున్న వివాదం మీద అభ్యంతరాలు నమోదు చేసినట్లు వార్తలు బయటకు వచ్చాయి.దీంతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఓటు డాటా బేస్ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడాన్ని ప్రతిపక్షాలు, సీజేపీ దీనిని ఓటు చోరీగా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీజేపీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది.సీజేపీ ఆందోళనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. 25 వేల పారామిలటరీ బలగాలను మోహరించారు. రైళ్లను రద్దు చేశారు. 45 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ లో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేశారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్ లో, సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నసింగ్ ను వారి నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. రైళ్లు రద్దు చేస్తూ ఆందోళనలు అదుపులోకి తేవాలని చేసిన ప్రభుత్వ చర్యలపై 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగిస్తారా' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.ప్రస్తుతం ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ చర్యలను సీజేపీ నియంతృత్వం, యువతను ప్రభుత్వం భయపెడుతోందని, మోడీ ఓటమి అంగీకరించాడని చెబుతుంది. ఢిల్లీని కంటోన్మెంట్ గా మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.గతంలో జరిగిన ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం తర్వాత అణచివేతకు కఠినంగా వ్యవహరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు నివారణాత్మకమేనా ? లేక అణచివేతనా ? అరెస్టు అయినవారు, అదుపులోకి తీసుకున్న వారు ఎప్పుడు విడుదల అవుతారు ? నిరసన ఎలా ముందుకు సాగుతుంది అన్న ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎవరిది పైచేయి అవుతుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

# విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

- మొదటి పేజి తరువాయి

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి దయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు.రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే

వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ.జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

### నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.
శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.
ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్
కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.
మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

### అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది.
ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది.
ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు.
ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.
ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి..

- మొదటి పేజి తరువాయి

నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జంతర్ మంతర్ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆగ్రహానికి గురైన నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది గాయపడ్డట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు.
కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్ వెళ్లే అన్ని మార్గాలను క్లోజ్ చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తీవ్ర నిర్బంధం ఉన్న నిరసనకారులు ధైర్యంగా రోడ్లపైకి వస్తున్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్న్?న్నారు. సీజేపీ నిరసన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఇప్పటికే పోలీసులు కఠిన ఆంక్షలు అమలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలను నిలిపివేయడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మరోవైపు జంతర్ మంతర్ దగ్గర బొద్దింక జనతా పార్టీ చేపట్టిన నిరసనలో పాల్గొంటారనే అనుమానంతో ఢిల్లీలోని లోధి ఎస్టేట్ వెలుపల ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులను నిర్బంధించారు. టీఎంసీ అధినేత్రి, బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని సైతం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల కొండ, సప్తగిరులు మొత్తం శ్రీ వేంకటేశ్వర స్వామికే సొంతమని, ఇతరులకు కేటాయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. గతంలో మైసూరు మహారాజుకు టీటీడీ 7.5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, దానిపై కర్ణాటక ప్రభుత్వం గెస్ట్‌హౌస్ నిర్మించుకుందని గుర్తుచేశారు.ఇటీవల కర్ణాటక కేబినెట్ ఈ గెస్ట్‌హౌస్‌ను తమ రాష్ట్ర పర్యాటక శాఖకు అప్పగించాలని నిర్ణయించిందని, ఈ నిర్ణయం వెనుక ఓ కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి హస్తం ఉందని భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వారికి నోటీసులు పంపుతామని, స్పందించకపోతే గెస్ట్‌హౌస్‌ను టీటీడీ ఆధీనంలోకి తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

- మొదటి పేజి తరువాయి

ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.
శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు.
ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

- మొదటి పేజి తరువాయి

విజయ్‌ను అక్టోబర్ 10, 2026న చెన్నైలో భేటీ అయ్యారు. తొలుత విజయ్ నివాసంలో సుమారు గంటపాటు సమావేశమైన ఇరువురు నేతలు, ఆ తర్వాత సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ తాగారు. ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.విజయ్ నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.సమావేశం అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లారు. అక్కడ కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు తీసుకున్నట్లు పీటీఐ వార్తా కథనం పేర్కొంది. కాంగ్రెస్, టీవీకే కలిసి పనిచేస్తున్న క్రమంలో కూటమి ఉమ్మడి కనీస కార్యక్రమం, భవిష్యత్తు ఎన్నికల ప్రణాళికలపై చర్చించే అవకాశం ఉందని సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. అయితే చర్చించిన ప్రతి అంశంపై అధికారిక ఎటువంటి ప్రకటన వెలువడలేదు.చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'ఛత్రోన్ కి గూంజ్' (మానవర్గళిన్ కురల్) విద్యార్థుల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ తమిళనాడుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడనున్నారు రాహుల్ . విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ గాంధీతో జరిగిన ఈ భేటీ..కాంగ్రెస్, టీవీకే రాజకీయ సంబంధాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలి.

-మండలం బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్ అక్టోబర్10:** జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉందని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారుడి.డి పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ధైర్యంగా బయటపెట్టినందుకు భూ మాఫియా దాడికి గురైన ప్రజాశక్తి విలేకరి సిగిరెడ్డి రమేష్ ను రౌతుపాలెం లో ఆయన నివాసంలో కిర్లంపూడి మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు శనివారం పరామర్శించారు.
ఈ సందర్భంగా రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి ధైర్యం చెప్పారు. విలేకరులపై ఇలాంటి దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాజబాబు డిమాండ్ చేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# తనుమళ్లలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం







- చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అంగన్వాడీ
- కార్యకర్తలకు ఘన సత్కారం
- చీరలు, జ్ఞాపికల పంపిణీ.. ఉత్తమ సేవలందించిన కార్యకర్తలు, ఆయాలకు పురస్కారాలు
- అంగన్వాడీల సమస్యలను మంత్రి సుభాష్ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తా
- వాసంశెట్టి సత్యం

**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా, వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తూ, విద్యాబుద్ధులు నేర్పిస్తూ, పోషకాహారం అందిస్తూ అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలు అమూల్యమని పలువురు ప్రముఖులు కొనియాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులను క్రమశిక్షణతో, ఆటపాటలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో తీర్చిదిద్దుతున్న కార్యకర్తలను గౌరవించుకోవడం సమాజ బాధ్యతని పేర్కొన్నారు. కాజులూరు మండలం తనుమళ్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గొల్లపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల ఉత్సవాన్ని శనివారం ఐసీడీఎస్ సీడీపీవో వై. శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ సేవల్లో 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో కార్యకర్తలు, ఆయాలను ఘనంగా సత్కరించి, చీరలు, జ్ఞాపికలు అందజేశారు. ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేసి వారి సేవలను గుర్తించారు.ఈ కార్యక్రమానికి సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, జనసేన పార్టీ యువనేత డాక్టర్ దేగల నాగేంద్ర తల్లి, బంధనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమల వేణి, జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**అంగన్వాడీ కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి: వాసంశెట్టి సత్యం**

ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలను ఉత్సవం పేరుతో గౌరవించడం అభినందనీయమన్నారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయసున్న చిన్నారులు తల్లిదండ్రులకు దూరంగా అంగన్వాడీ కేంద్రాల్లో గడిపే సమయంలో వారికి తల్లిలా సంరక్షణ అందిస్తూ, విద్యాబుద్ధులు నేర్పిస్తూ, ఆటపాటలతో వారి మానసిక వికాసానికి కృషి చేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పనని అన్నారు.ఎంతో ఓర్పు, సహనంతో చిన్నారుల సంరక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్న కార్యకర్తలు, ఆయాల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సమాజ నిర్మాణంలో అంగన్వాడీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.వారుఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సుభాష్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కార్యకర్తల కుటుంబాల్లో వృద్ధులు, దివ్యాంగులు ఉంటే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.పిల్లలకు ఆదిగురువులు అంగన్వాడీ టీచర్లు:ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. పిల్లలకు అంగన్వాడీ టీచర్లు ఆదిగురువులని, చిన్నారుల మానసిక ఉల్లాసానికి, వ్యక్తిత్వ వికాసానికి వారు అందించే శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. భావి భారత పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దే బాధ్యతను చేపట్టడం గర్వకారణమని అంగన్వాడీ సిబ్బందిని అభినందించారు.

**తల్లి తర్వాత అంతటి స్థానం అంగన్వాడీ కార్యకర్తలదే: పోలిశెట్టి చంద్రశేఖర్**

జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ, చిన్నతనంలో పిల్లలకు నేర్పించే విషయాలు వారి మనసుల్లో బలంగా నాటుకుపోతాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారంతోపాటు విజ్ఞానాన్ని అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. పిల్లల జీవితాల్లో తల్లి తర్వాత అంతటి ప్రాధాన్యం అంగన్వాడీ కార్యకర్తలకే దక్కుతుందని కొనియాడారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి తమను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు.

**అంగన్వాడీ కేంద్రాలే చిన్నారులకు తొలి పాఠశాలలు:**

బంధనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమల వేణి మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లను గౌరవించుకోవడం ప్రశంసనీయమన్నారు. ఒక తల్లి ఒడి నుంచి మరో తల్లి ఒడికి చేరినట్లుగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంరక్షణ లభిస్తుందని అభివర్ణించారు. పిల్లలు క్రమశిక్షణతో జీవితంలో తొలి అడుగులు వేయడానికి అంగన్వాడీ కేంద్రాలు దోహదపడుతున్నాయని అన్నారు.ఆయాలు చిన్నారులను ఇళ్ల నుంచి కేంద్రాలకు తీసుకురావడం, ఉదయం నుంచి సాయంత్రం వరకు వారిని ఆటపాటలతో అలరిస్తూ, కంటికి రెప్పలా కాపాడి తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేర్చడం సాధారణమైన విషయం కాదని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను గుర్తించి గౌరవించడం సమాజానికి మంచి సందేశమని తెలిపారు.ఈ సందర్భంగా కార్యకర్తలకు చీరలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఉత్తమ సేవలకు పురస్కారాలు.. కార్యకర్తలకు సన్మానం**

కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉత్తమ అవార్డులు అందుకున్న కార్యకర్తల్లో నేకూరి అరుణ, వీవీఎస్ నాగమ్మ, వసంతకుమారి, వెంకటలక్ష్మి, వీరలక్ష్మి, పి. రత్నకుమారి, సత్యవేణి తదితరులు ఉన్నారు. అలాగే ఉత్తమ సేవలకుగాను అంగన్వాడీ సహాయకుల విభాగంలో మట్టా వి.వి. సత్యనారాయణమ్మ, పిల్లి లక్ష్మి, లంకా సూర్యకుమారి, పితాని సత్యవతి, ముడుగు సత్యవతి, కొప్పుశెట్టి దుర్గాదేవి, నాగిరెడ్డి వీరలక్ష్మి, ఆచంట వీరలక్ష్మి, గాదా రాణి, మోకన నాగమణి తదితరులు అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు. వాసంశెట్టి సత్యం, దేగల తిరుమల వేణి తదితరులు అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. మిగిలిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను పోలిశెట్టి చంద్రశేఖర్, అక్కల రిష్వంత్ రాయ్, సలాది సాయిబాబు,కోట తాతబ్బాయి, పలివెల రాజు,చందాల ఆదినారాయణ, వనుం వీరబ్రహ్మం,సీడీపీవో వై. శ్రీదేవి, సూపర్‌వైజర్ కె.రమణికుమారి తదితరులు సన్మానించారు.

**దాతలకు నిర్వాహకుల కృతజ్ఞతలు**

అంగన్వాడీ కార్యకర్తలను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చి చీరలు అందజేసిన దేగల తిరుమల వేణికి వాసంశెట్టి సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సోమరాజు, చందాల మల్లిబాబు తదితరులను అభినందించారు.కాజులూరు మండల టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), వనుం వీరబ్రహ్మం తదితరులు అంగన్వాడీ కార్యకర్తలకు చీరలు అందజేశారు. ముధునూరి వెంకట సోమరాజు, చందాల మల్లిబాబు, నల్లా వసంత తదితరులు అంగన్వాడీ హెల్పర్లకు చీరలతోపాటు ఇతర వస్తువులను అందజేసినట్లు ఖండవల్లి శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఖండవల్లి శ్రీనివాసరావు, బూలా అప్పారావు, బూలా సురేష్, పోతుల భీమరాజు తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.
చిన్నారుల సంరక్షణ నుంచి వారి ప్రాథమిక విద్య వరకు నిరంతరం శ్రమిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల సేవలను గుర్తించి గౌరవించడం ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. సేవలకు తగిన గుర్తింపు, సమస్యలకు పరిష్కారం, సిబ్బందికి ప్రోత్సాహం లభించినప్పుడే అంగన్వాడీ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



## కాకినాడ జేఎన్టీయూలో సీఐఐ ప్రాంతీయ సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 10**: కాకినాడ జేఎన్టీయూలో ఈ నెల 12న నిర్వహించనున్న భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సదస్సుకు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వసతి, భోజన సదుపాయాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శనివారం సాయంత్రం కాకినాడ జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చివరి దశలో పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. పోలీసు శాఖ సమన్వయంతో ప్రవేశ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ప్రతినిధులు, సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సదస్సును వీక్షించేందుకు, ప్రదర్శనశాలను సందర్శించేందుకు వచ్చే సాధారణ ప్రజలను మధ్యాహ్న భోజన విరామం అనంతరం, ముఖ్య అతిథులు వెళ్లిన తర్వాత,సాయంత్రం మూడు గంటల నుంచి మాత్రమే అనుమతించాలని తెలిపారు. ప్రజాప్రతినిధుల రాక సందర్భంగా ప్రత్యేక ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకునే వీఐపీలకు అవసరమైన రవాణా, వసతి సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు.సభా ప్రాంగణంలోని ముఖ్య ప్రవేశ ద్వారాల వద్ద స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న అధికారులు, సిబ్బందిని నియమించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రాంతాలను కేటాయించి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సందర్శకులు, ప్రతినిధులు తమకు కేటాయించిన ప్రాంతాలను సులభంగా గుర్తించేలా అవసరమైన చోట్ల స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్కులు, రిఫ్రెష్‌మెంట్, భోజన ఏర్పాట్ల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ సదస్సు విజయవంతంగా జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎం. కిషోర్ కుమార్, కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జనార్దన స్వామి వారి సేవలో వైజాగ్ ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ మహేంద్రనాథ్



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారిని శనివారం వైజాగ్ ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ మహేంద్రనాథ్, మండపేట ఏడీఈ శ్రీధర్ తో కల్సి దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. స్వామివారిని దర్శనానంతరం ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు వారికి వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేల ఏళ్ల నాటి మహిమాన్విత ఆలయాన్ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గోదావరి పుష్కరాల
## పనులు వేగవంతం చేయాలి
### కమిషనర్ రామచంద్ర మోహన్



**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబరు 10:** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన మందపల్లి దేవస్థానాన్ని సందర్శించి, పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న తైలాభిషేక మండపం, అన్నప్రసాద భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**నిర్మాణ పనులపై అధికారులకు సూచనలు**

ముందుగా తైలాభిషేక మండపం, అన్నప్రసాద భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్.. పనుల ప్రస్తుత స్థితిగతులు, పురోగతిపై దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, భక్తులకు ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అనంతరం పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు మరింత వేగంగా పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

**పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు**

గోదావరి పుష్కరాల సమయంలో మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, వారికి అవసరమైన సౌకర్యాల కల్పనపై దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తైలాభిషేక మండపం, అన్నప్రసాద భవన నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే భక్తులకు తైలాభిషేక సేవలు, అన్నప్రసాద వితరణలో మరింత సౌకర్యం కలగనుంది.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ**

ఈ పరిశీలనలో దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వేంద్ర త్రినాథరావు, సాంకేతిక సలహాదారు సుబ్బారావు, సూపరింటెండింగ్ ఇంజినీర్ దుర్గేశ్ కుమార్, డివిజనల్ ఇంజినీర్ ఉదయ్ కుమార్, ఉపస్థపతి సతీష్ పాల్గొన్నారు.
దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, నేరేడుమిల్లి మహాలక్ష్మి, ఏడుకొండలు, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంత లక్ష్మిసావిత్రి, శ్రీనివాస్ పాల్గొన్నారు. మందపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ సిద్ధంశెట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చింతం విజయ కృష్ణ మోహన్‌రావు, ఇతర గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ వివరాలను దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు వెల్లడించారు.



# వేలంక రోడ్డు విస్తరణకు 50 లక్షలు విలువచేసే భూమిని దానం చేసిన తోట నవీన్.

**జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ కు కృతజ్ఞతలు తెలియజేసిన వేలంక గ్రామస్తులు.**





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 10:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలోని చిల్లంగి గ్రామ శివారు నుండి వేలంక గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుని అభివృద్ధిపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2 కోట్ల 14 లక్షలు రూపాయలను మంజూరు చేసింది.ఈ రోడ్డులో ప్రస్తుతం ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా తప్పుకునే పరిస్థితి లేదు. రఇరుకు రోడ్డు కారణంగా ఆ గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేసిన సందర్భం కూడా నెలకొంది.దీంతో వేలంక రోడ్డు అభివృద్ధిలో భాగంగా తమ గ్రామానికి రోడ్డు వెడల్పు చేయించుకోవాలన్న సంకల్పంతో వేలంక గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తులు కలసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ ప్రతిపక్షనేత, తోట నవీన్ ను కిర్లంపూడిలో ఉన్న ఆయన నివాసానికి చేరుకొని తమ గ్రామానికి వెళ్లే రోడ్డును వెడల్పు చేసుకునేందుకు రోడ్డు వెంబడి ఉన్న తమకు చెందిన పొలాన్ని సుమారు కిలోమీటర్ మేర ఐదు అడుగులు వెడల్పు రోడ్డు విస్తరణకు స్థలాన్ని ఇవ్వాలని తోట నవీన్ ను అభ్యర్థించారు.దీంతో తక్షణమే స్పందించిన తోట నవీన్ వేలంక గ్రామస్తులతో పాటు రోడ్డుని ఆనుకొని ఉన్న తన పొలానికి చేరుకొని రోడ్డుకు అవసరమయ్యే స్థలాన్ని చివరివరకు కాలినడకన పరిశీలించారు. సుమారు అరెకరం పైబడి తన పొలం వెంబడి ఉన్న భూమిని రోడ్డు విస్తరణకు అవసరం అవుతుందని గుర్తించిన తమ భూమిని రోడ్డు అభివృద్ధి కోసం తనతోపాటు తన సోదరులు తరఫున దానంగా ఇస్తున్నట్లు వేలంక గ్రామస్తులు సమక్షంలోనే తోట నవీన్ ప్రకటించారు. దానం చేసిన భూమి విలువ సుమారు 50 లక్షల పైబడి ఉంటుందని తమ కోరికను మన్నించి అంత విలువైన భూమిని తమ గ్రామస్తుల కోసం దానం చేయడం పట్ల వేలంక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి సహృదయంతో ముందుకు వచ్చి ఎంతో విలువైన భూమిని దానం చేసిన తోట నవీన్,వారి సోదరులకు వేలంక గ్రామస్తులు, గ్రామ పెద్దలు ప్రత్యేకమైన కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేలంక మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు, గ్రామ తెదేపా నాయకులు గండే చినరాజు, బేతాళ బాబ్జి,ఇంటి చెల్లారావు, గండే రాయుడు, బేతాళ భాస్కరరావు,పలువురు గ్రామపెద్దలు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఈసీని కాపాడేందుకు ఢిల్లీని పోలీస్ రాజ్యంగా మార్చారు.

- ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆగ్రహం.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్,10:** భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ని కాపాడేందుకే మోడీ ప్రభుత్వం ఢిల్లీని పోలీసు రాజ్యాంగంగా మార్చారని ప్రత్తిపాడులో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో ఆగ్రహం చేసారు.ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన యువత, న్యాయవాదులపై మోడీ ప్రభుత్వం జరిపిన దాడిని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) తీవ్రంగా ఖండించింది.ఓట్ల అవకతవకలకు పాల్పడి కోట్ల మంది పౌరుల ఓట్లను కాజేసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ను రక్షించేందుకే కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని పోలీస్ రాజ్యంగా మార్చిందని, ఈ చర్య ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమని ఐలాజ్ ఆరోపించింది.ఈ సందర్భంగా ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగతా శివ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, యువతను,న్యాయవాదులను, ప్రజా స్వామ్యవాదులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే ఎటువంటి షరతులు లేకుండా విడుదల చేయాలని బుగతా శివ డిమాండ్ చేశారు.ఓట్ల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగించి ప్రజాస్వామ్య బద్ధమైన నిరసనలను అణచివేయాలని చూడటం పట్ల ఐలాజ్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుందన్నారు.

# తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం



**కిర్లంపూడి, పెన్ పవర్ అక్టోబర్10:**కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలోని వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర ఆలయ ప్రాంగణంలోని గణపతి ఆలయం వద్ద వినాయక చవితి సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ముందుగా తుమ్మలపల్లి రమేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమం లో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జనసేన పార్టీ స్టేట్ ప్రోగ్రామింగ్ కమిటీ వైస్ చైర్మన్ తుమ్మలపల్లి సాయి చంద్రశేఖర్, ఎంపీటీసీ బండారు ప్రసాద్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా పలువురు నాయకులు జనసైనికులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో వెరిలాగ్ సాంకేతికతపై మూడు రోజుల శిక్షణ




**వి.ఎల్.ఎస్.ఐ. రంగంలో విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానం**

**గండేపల్లి,పెన్ పవర్, అక్టోబర్ 10:** ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు 'వి.ఎల్.ఎస్.ఐ.లో వెరిలాగ్ ఉపయోగించి డిజిటల్ రూపకల్పన' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్ 8 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌కు చెందిన ఆర్ టెక్నో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన ఇంజనీర్లుగా తీర్చిదిద్దేందుకు కళాశాల కృషి చేస్తోందని పేర్కొన్నారు.శిక్షణలో భాగంగా ఆర్ టెక్నో సొల్యూషన్స్ ప్రతినిధులు విద్యార్థులకు వి.ఎల్.ఎస్.ఐ. అనువర్తనాలు, డిజైన్ నమూనాలు, డిజిటల్ రూపకల్పనకు సంబంధించిన ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యక్ష అభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్ తెలిపారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులు వి.ఎల్.ఎస్.ఐ. రంగంలో భవిష్యత్తులో లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి దోహదపడతాయని విద్యుత్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె.వి. దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యాపక సమన్వయకర్తగా పి. పుష్పలత వ్యవహరించారు. కళాశాల నిర్వహణ డైరెక్టర్ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, విద్యా వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, కార్యక్రమ సమన్వయకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అడోబ్ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే కు ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యార్థులు

- మూడులక్షలకుపైగారిజిస్ట్రేషన్లు... తుది ఎనిమిది టీమ్ ల లో ఆదిత్య'నెక్సోరా తెలుగురాష్ట్రాలనుంచిఎంపికైనఏకైక
- విద్యాసంస్థ --- అక్టోబర్ 15ననోయిడాకువిద్యార్థులబృందం




**గండేపల్లి, పెన్ పవర్ (సూరంపాలెం) అక్టోబర్ 10** అడోబ్ యూనివర్సిటీ హ్యాకథాన్--2026లో ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి గ్రాండ్ ఫినాలే కు ఎంపికైనట్లు ప్రో. ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. మూడు లక్షలకు పైగా రిజిస్ట్రేషన్ లు నమోదైన ఈ పోటీలో విశ్వవిద్యాలయానికి చెందిన 'టీమ్ నెక్సోరా' గ్రాండ్ ఫినాలే కు ఎంపికైన ఎనిమిది జట్లలో స్థానం సాధించింది అని తెలుగు రాష్ట్రాల నుంచి ఈ తుది పోటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక విద్యాసంస్థగా ఆదిత్యవిశ్వవిద్యాలయం నిలిచింది అని ఆనందం వ్యక్తం చేసారు. గ్రాండ్ ఫినాలే లో పాల్గొనేందుకు విద్యార్థుల బృందం అక్టోబర్ 15న నోయిడాకు పయనం కానుంది అని చెప్పారు.. ఐఐటీపట్నా, ఐఐటీ గువాహటి, ఐఐఐటీ అలహాబాద్ , అమృత విశ్వవిద్యాపీఠం--కోయంబత్తూరు, శివనాడార్ విశ్వవిద్యాలయం--గ్రేటర్నోయిడా, అటల్ బిహారీవాజ్‌పేయి--ఇండియన్ఇన్‌స్టిట్యూట్ఆఫ్ఇన్ఫర్మేషన్టెక్నాలజీ అండ్మేనేజ్‌మెంట్, ఇంద్ర ప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టేక్నాలజీ--ఢిల్లీతోపాటు ఆదిత్య విశ్వవిద్యాలయం గ్రాండ్ ఫినాలే లో పాల్గొననుంది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సరసన స్థానం సాధించడం ఆదిత్య విద్యార్థులు సాంకేతిక ప్రతిభకు, నిరంతర కృషి, పట్టుదల కు నిదర్శనం అన్నారు. 'టీమ్నెక్సోరా 'లో ధనుష్ కొనకొండ్ల, అజర్య పాల్ అంత పర్తి, శ్రీరాజ్ గంగిశెట్టి సభ్యులుగా ఉన్నారు. వీరికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం హ్యాకథాన్ కో -ఆర్డినేటర్. ఎం. అశోక్ తేజ మెంటర్‌గా మార్గదర్శకత్వం వహిస్తున్నారు. జాతీయ స్థాయి వేదిక పై ఆదిత్య విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకొచ్చిన ఈ బృందం సాధన తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనలు, సమష్టి కృషి కి ఈ విజయం అద్దం పడుతోంది. గ్రాండ్ ఫినాలే లో నెక్సోరా టీమ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా.జి.సురేష్, ప్రో.వైస్ ఛాన్సలర్ లు డా.ఎస్.రమాశ్రీ,డా.ఏ.రమేష్,డా.రవి తంగజం, డీన్ టెక్నికల్ ట్రైనింగ్ జి.రాము ఆకాంక్షించారు.

# ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ లో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్, 10:**గండేపల్లి మండలం సూరంపాలెం లో గల ఆదిత్య యూనివర్సిటీ లోని స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది "ఫార్మసిస్టుల ద్వారా ఆరోగ్యవంతమైన రేపటి సమాజం" అనే థీమ్తో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ మురళి గారు ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు అతిథి ఉపన్యాసం అందించారు. ఔషధాల నాణ్యత, సురక్షితమైన మందుల వినియోగం, ఔషధ నియంత్రణ వ్యవస్థ లో ఫార్మసిస్టుల బాధ్యతలు, ప్రజారోగ్య పరిరక్షణలో వారి ప్రాముఖ్యత గురించి వివరించారు.అనంతరం, వివిధ సెమిస్టర్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పథకాలు అందజేసి అభినందించారు. విద్యార్థులు విద్యా పరంగా మరింత రాణిస్తూ, భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన ఫార్మసిస్టులు గా ఎదగాలని ఆకాంక్షించారు."సురక్షితమైన మందులు -- మెరుగైన ఆరోగ్యం, బలమైన సమాజం -- ఆరోగ్యవంతమైన భవిష్యత్తు" అనే సందేశంతో, ప్రజలకు ఔషధాల సురక్షిత వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల సేవలను గుర్తు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.అదేవిధంగా ... ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం :ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో "ఎర్లీ డిటెక్షన్ సేవ్స్ లైవ్స్: స్టాండ్ ఎగైనెస్ట్ బ్రెస్ట్ క్యాన్సర్" అనే నినాదంతో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు, మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య నిపుణులు సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్, కాకినాడ కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పి. సంధ్య ముఖ్య వైద్య నిపుణురాలు హాజరై, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు గుర్తింపు, వైద్య పరీక్షలు, చికిత్స విధానం గురించి వివరించారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ, పాల్గొన్నవారు అడిగిన సందేహాలు అన్నింటినీ నివృత్తి చేశారు. రొమ్ములో గడ్డలు, అసాధారణ వాపులు, ఆకృతిలో మార్పులు, చనుమొనల లో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు అని డాక్టర్ సంధ్య సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ శరణ్య, డీన్--స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ డి. కిషోర్, డీన్--స్కూల్ ఆఫ్ ఫార్మసీ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎక్స్టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డాక్టర్ ఐ.వి. వీరాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.వి. పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రానున్న స్థానిక ఎన్నికల వైసిపి శ్రేణులు సిద్ధం కావాలి: గిరిబాబు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 10:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ప్రత్తిపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఏలేశ్వరం మండల పరిధిలో గిరిజన ప్రాంతాలను ఆనకొని ఉన్న రూరల్ గ్రామాలు మర్రివీడు, జె అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, లింగంపర్తి, సి రాయవరం, రమణయ్యపేట, యర్రవరం గ్రామాల్లో శనివారం పర్యటించారు. రాజకీయ పరిస్థితులను అంచనా వేసేందుకు, గ్రామాల్లోని ప్రముఖులను పరామర్శించేందుకు వెళ్లారు. పలు సందర్భాల్లో ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసేలా సీనియర్ నాయకులు సలహాలు ,సూచనలు ఇవ్వడంతో పాటు క్రియాశీలకంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పర్యటనలో ముద్రగడ వెంట గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, సఖి రడ్డి బుజ్జి, గొల్లపల్లి సురేష్, పల్లెల బ్రహ్మానందం, రాహుల్ గాంధీ, కొండపల్లి చంటిబాబు, కాలారి సత్తిబాబు, భీశెట్టి అప్పలరాజు, వడ్డీ వాస్తవ్య రాజు, గొంతు రెడ్డి సతీష్, రామకృష్ణ, కొండబాబు, రాయవరం మాజీ సర్పంచ్ వెంకట రమణ, వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# బీసీల రాజకీయ సాధికారతకు 34 శాతం రిజర్వేషన్లే కీలక ప్రాతిపదిక



- సామాజిక న్యాయ పరిరక్షణలో నారా లోకేష్ ప్రకటన హర్షణీయం
- స్థానిక స్వపరిపాలనలో బీసీల భాగస్వామ్య విస్తరణకు దోహదం

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 10:**స్థానిక స్వపరిపాలనా వ్యవస్థల్లో వెనుకబడిన తరగతుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసి, ప్రజాస్వామ్య పాలనలో వారి భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసే దిశగా బీసీలకు పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటన హర్షణీయమని టీడీపీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఆత్రేయపురం మండలం నార్కెలమిల్లిలోని మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, బీసీలకు రాజకీయ రంగంలో సముచిత అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయ సాధనకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బీసీ వర్గాల రాజకీయ ఎదుగుదలకు, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్య విస్తరణకు ఈ ప్రకటన దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బీసీల హక్కుల పరిరక్షణలో రాజకీయ చిత్తశుద్ధి అవసరం**

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పాలనా వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి సమస్యలకు సముచిత పరిష్కార మార్గాలు లభిస్తాయని నాయకులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు వంటి స్థానిక సంస్థలు ప్రజల అవసరాలను ప్రతిబింబించే కీలక ప్రజాస్వామ్య వేదికలని వివరించారు. ఈ వ్యవస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సామాజిక, ఆర్థిక సమస్యలు పాలకుల దృష్టికి మరింత సమర్థవంతంగా చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిపోయాయని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన సమయంలో తగిన చర్యలు చేపట్టడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీసీల రాజకీయ హక్కుల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వాల చిత్తశుద్ధి, న్యాయపరమైన కార్యాచరణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు.

**రాజకీయ ప్రాతినిధ్యమే సామాజిక అభ్యున్నతికి పునాది**

బీసీల అభ్యున్నతి కేవలం సంక్షేమ పథకాల అమలుతోనే సంపూర్ణం కాదని, నిర్ణయాధికార వ్యవస్థల్లోనూ వారికి తగిన స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే ఆయా వర్గాల అవసరాలు, ఆకాంక్షలు ప్రజాపాలనలో ప్రతిఫలించే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత అవకాశాలు లభించడం ద్వారా గ్రామీణ ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు.రిజర్వేషన్ల అమలుకు సంబంధించి న్యాయపరమైన పరిమితులు, రాజ్యాంగ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటూనే బీసీలకు గరిష్ఠ స్థాయిలో రాజకీయ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న నారా లోకేష్ ప్రకటన బీసీ వర్గాల్లో రాజకీయ భాగస్వామ్యంపై ఆశలను పెంపొందిస్తోందని పేర్కొన్నారు.

**బీసీలకు సముచిత అవకాశాలు కల్పించాలి**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. సామాజిక సమానత్వం, రాజకీయ సాధికారత, సమగ్ర గ్రామీణ అభివృద్ధి లక్ష్యాల సాధనకు బీసీల భాగస్వామ్యం అనివార్యమని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి సంబంధించిన హామీలు కార్యాచరణ రూపంలో అమలైతేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గుడెల్ల నాగేంద్ర గౌడ్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు మిద్దె గోపాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొని, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసే చర్యలకు తమ మద్దతు ప్రకటించారు. బీసీల హక్కుల పరిరక్షణ, రాజకీయ అవకాశాల విస్తరణ, సామాజిక న్యాయ సాధన దిశగా సమిష్టి కృషి అవసరమని వారు పిలుపునిచ్చారు.

## వాడపల్లి వెంకన్న భక్తుల రాకపోకలకు రహదారి విస్తరణ

- ఏటిగట్టు రహదారి అభివృద్ధికి రూ.19 కోట్లు కేటాయించాలి
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విజ్ఞప్తి.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 10:**కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం నిత్యం వేలాదిగా తరలివచ్చే భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించే లక్ష్యంతో రావులపాలెం నుంచి వాడపల్లి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు రూ.19 కోట్లు కేటాయించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న భక్తుల తాకిడి, వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారిని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**రూ.8 కోట్లతో ఇప్పటికే నిధుల కేటాయింపు**

వాడపల్లి క్షేత్రానికి వెళ్లే ఏటిగట్టు రహదారి అభివృద్ధి దిశగా ఇప్పటికే రూ.8 కోట్ల నిధులు మంజూరైనట్లు సమాచారం. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటు పుష్కర నిధులు, ఇతర నిధులను సమీకరించి ఈ మేరకు కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. అయితే, భవిష్యత్తులో పెరగనున్న భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారిని మరింత విస్తృతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సత్యానందరావు ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపథ్యంలో అదనపు నిధులతో కలిపి మొత్తం రూ.19 కోట్లతో రహదారి విస్తరణ, నిర్మాణ పనులు చేపట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారుల పరిశీలన**

ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తి నేపథ్యంలో ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. బాలునాయక్, సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీతంనాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యం రాంబాబు తదితర అధికారులు శనివారం ఏటిగట్టు రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి ప్రస్తుత పరిస్థితులు, వాహనాల రాకపోకలు, విస్తరణకు అవసరమైన స్థల సౌకర్యాలను పరిశీలించి నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక వివరాలను సేకరించారు.

**5.5 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు**

ఏపీఆర్ఆర్ఎస్పీ నిధుల కింద జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు పరిశీలించారు. తొలిదశలో 5.5 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను అంచనా వేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా సమగ్ర అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వివరించారు.

**భక్తుల రాకపోకలకు మెరుగైన సదుపాయాలే లక్ష్యం**

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శనివారాలు, పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏటిగట్టు రహదారి విస్తరణ పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు భక్తుల ప్రయాణానికి మరింత అనుకూలత ఏర్పడే అవకాశం ఉంది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవతో రహదారి అభివృద్ధి ప్రతిపాదనలు క్షేత్రస్థాయి పరిశీలన దశకు చేరుకోవడం పట్ల స్థానికులు, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రావులపాలెం--పలివెల రహదారి అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు



- దెబ్బతిన్న 9 కిలోమీటర్ల రహదారికి మహర్దశ
- మూడు నెలల్లో పనులు ప్రారంభించేలా చర్యలు
- వెల్లడించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 10:**కోనసీమ ప్రాంతంలో రవాణా సౌకర్యాల మెరుగుదలకు మరో ముందడుగు పడింది. రావులపాలెం బ్రిడ్జి నుంచి వెదిరేశ్వరం మీదుగా పలివెల బ్రిడ్జి వరకు విస్తరించిన జాతీయ రహదారి 216ఈపై దెబ్బతిన్న మార్గానికి ప్రత్యేక మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెల్లడించారు. దీర్ఘకాలంగా రహదారి దుస్థితితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులకు ఉపశమనం కలిగించేలా సుమారు 9 కిలోమీటర్ల మేర రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

**రెండు భాగాలుగా నిధుల కేటాయింపు**

రహదారిపై 22.730 నుంచి 27.600 కిలోమీటర్ల వరకు మరమ్మతుల కోసం రూ.10 కోట్లు, 27.600 నుంచి 31.710 కిలోమీటర్ల వరకు మరో రూ.10 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. మొత్తం రూ.20 కోట్లతో రహదారిని అభివృద్ధి చేసి ప్రయాణానికి అనువుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**త్వరలో టెండర్లు.. మూడు నెలల్లో పనులు**

మరమ్మతుల పనులకు సంబంధించి త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టి, మూడు నెలల్లో పనులు ప్రారంభించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పనుల నిర్వహణలో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారి అభివృద్ధి పూర్తయితే వాహనదారుల ప్రయాణ ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రాంతీయ రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



**వచ్చే ఏడాది పూర్తిస్థాయి అభివృద్ధికి ప్రణాళిక**

ప్రస్తుత మరమ్మతులతో పాటు వచ్చే ఏడాది రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రవాణా సౌకర్యాల విస్తరణతో స్థానిక ప్రజలు, వ్యాపారులు, నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. జాతీయ రహదారి 216ఈపై కీలకమైన ఈ మార్గాన్ని మెరుగుపరచడం ద్వారా కోనసీమ ప్రాంతంలో రహదారి అనుసంధానం మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు.

## ఏడు కొండల వేంకటేశ్వరుని రూపంలో దర్శనమిచ్చిన జనార్ధనస్వామి

- ఆలయంలో అడుగడుగునా వెల్లువెత్తిన భక్తి పారవశ్యం...పులకించిన భక్త జనం




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**నారద ప్రతిష్ఠిత నవ జనార్దన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారు మహాలయ అమావాస్య, శని అమావాస్య సందర్భంగా దేవదేవుడైన ఏడుకొండల వేంకటేశ్వరస్వామివారి అలంకరణలో దర్శనమిచ్చారు. వర్ణమయమైన పుష్ప మాలికలు, పట్టు పీతాంబరాల మధ్య శ్రీదేవి, భూదేవిలతో కూడి ఏడు కొండలను అధిష్ఠించి వేంకటాద్రిపై నిల్చిన రీతిలో దర్శనమిచ్చిన స్వామివారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారిని తిలకించి భక్త జనం పులకించారు. ఆపద్బాంధవా...అనాథ రక్షకా...నవ జనార్దన గోవిందా...గోవిందా అంటూ ఆలయ పరిసరాలు మారుమ్రోగిపోయాయి. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు, ఖండవల్లి ప్రభాకరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్యూలైన్లలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు స్వామివారి సేవకులు నియంత్రిస్తూ స్వామి సేవలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈవో నరేంద్ర కుమార్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు దగ్గరుండి పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తుల కోసం ఆలయంలో ఊబలంకకు చెందిన ఏ1 కాంట్రాక్టర్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి సౌజన్యంతో అన్నప్రసాద వితరణ జరిపారు.

## ఆదిత్య లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్, 10:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 11-10-2026 (ఆదివారం) దసరా నవరాత్రులు మొదటి రోజున అమ్మవారి కలశ స్థాపన. (ఉదయం 8 గంటల 30 నిమిషాలకు) 16-10-2026 (శుక్రవారం) మూలా నక్షత్రం, సరస్వతి అమ్మవారి అభిషేకం, ప్రత్యేక పూజలు. 18-10-2026 (ఆదివారం) దుర్గాష్టమి / దుర్గా హోమం. 20-10-2026 విజయదశమి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, శమీ పూజ. శ్రీశ్రీ షిర్డీ సాయిబాబా వారి మహా సమాది చెందిన రోజు పురస్కరించుకుని బాబా గారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు.ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు విశేష పూజలు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అందరూ పాల్గొనవచ్చు అని తెలిపారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. బాలునాయక్

- వేదమంత్రాలతో అర్చకుల ఆశీర్వచనం.. స్వామివారి చిత్రపటంతో సత్కరించిన ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 10**:కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. బాలునాయక్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు అమలాపురం పంచాయతీరాజ్ ప్రాజెక్టుల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు అన్యం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ అధికారులకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి వారిని సత్కరించారు. భక్తిభావంతో సాగిన ఈ దర్శన కార్యక్రమంలో ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా మర్యాదలు నిర్వహించారు.పంచాయతీరాజ్ శాఖలో ఎం.టెక్, ఎం.బి.ఏ. విద్యార్హతలు కలిగిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు అన్యం అమలాపురం కేంద్రంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ప్రాజెక్టుల నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.వాడపల్లి క్షేత్రంలో స్వామివారి దర్శనం ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగించిందని ఈ సందర్భంగా భక్తులు పేర్కొన్నారు.

# ఆశావర్కర్ల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి

- ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజాకు వినతిపత్రం అందజేసిన ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల ఆశావర్కర్లు.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 10**:ప్రత్తిపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాను నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల ఆశావర్కర్లు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ప్రస్తుతం తమకు నెలకు రూ.10,000 కనీస వేతనం అందుతోందని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని తమ కనీస వేతనాన్ని నెలకు రూ.26,000 రూపాయలు పెంచాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, శిక్షణ పొందిన ఏఎన్ఎం, జీఎన్ఎమ్ లకు పెర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, తమ న్యాయమైన డిమాండ్ ల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ను ఆశావర్కర్లు విజ్ఞప్తి చేశారు.ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సత్యప్రభరాజా ఆశా కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

# శంఖవరం బైపాస్ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సమీక్ష

-రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నివేదికలను పరిశీలించిన ఎమ్మెల్యే



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 10**:ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రహదారి సదుపాయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ప్రత్యేక దృష్టి సారించారు.శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రౌతులపూడి, శంఖవరం మండలాల తహసీల్దార్లతో ఎమ్మెల్యే సత్యప్రభరాజా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో శంఖవరం--రౌతులపూడి రహదారి నిర్మాణానికి సంబంధించిన అంశాలతో పాటు, శంఖవరం బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి అధికారులు సమర్పించిన నివేదికలను ఎమ్మెల్యే సత్యప్రభ పరిశీలించారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలు, అవసరమైన తదుపరి చర్యలపై అధికారులతో చర్చించారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, రహదారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం లక్ష్యంగా సంబంధిత అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో రౌతులపూడి, శంఖవరం మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# అమావాస్య శనివారం.. మందేశ్వర స్వామి ఆలయానికి రూ.5.16 లక్షల ఆదాయం



**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబరు 10:**శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి వారి దేవస్థానానికి అమావాస్య శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో తైలాభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష పూజలు, పరోక్ష (ఆన్‌లైన్) పూజలు, అన్నప్రసాద విరాళాల ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.5,16,431 ఆదాయం సమకూరినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు వెల్లడించారు.

పూజల వారీగా ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి.

ముఖమండపం తైలాభిషేకం ద్వారా 37 పూజలకు రూ.25,900, ఏకాదశ రుద్ర తైలాభిషేకం ద్వారా 439 పూజలకు రూ.1,09,750, మహాన్యాస పూర్వక తైలాభిషేకం ద్వారా 526 పూజలకు రూ.92,050 ఆదాయం లభించింది. తైలం సమర్పించి దర్శనం చేసుకున్న 344 మంది భక్తుల ద్వారా రూ.27,520, తిలదానం ద్వారా రూ.900, స్వయం హోమం ద్వారా రూ.4,000, కేశఖండన ద్వారా రూ.40 ఆదాయం సమకూరింది. ఈ విధంగా ప్రత్యక్ష పూజల ద్వారా మొత్తం రూ.2,60,160 ఆదాయం వచ్చింది. పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.2,16,200, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.40,071 సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మూడు విభాగాల ఆదాయం కలిపి మొత్తం రూ.5,16,431 వచ్చినట్లు వెల్లడించారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం





- వెంకన్న సన్నిధికి భక్తజన ప్రవాహం.. ఒక్కరోజే 80 వేల మందికి పైగా దర్శనం
- రూ.55 లక్షల ఆదాయం సమకూర్చిన భక్తకోటి

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 10 :** ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ, అశేష భక్తజన సందోహంతో కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రం శనివారం జనసంద్రంగా మారింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసుని దర్శనాభిలాషతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే స్వామివారి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, అర్చక బృందం ఆగమోక్త సంప్రదాయాల నడుమ మేల్కొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, సుప్రభాత సేవలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించింది. స్వామివారికి తొలి హారతులు సమర్పించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

దూరప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సుదీర్ఘ నిరీక్షణ అనంతరం శ్రీవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని పులకించిపోయారు. తమ కుటుంబాల సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థిస్తూ మొక్కులు సమర్పించుకున్నారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకటేశ్వర స్వామి నోము ఆచరించే భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది. మరికొందరు భక్తులు గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకుని తమ ఆధ్యాత్మిక నియమాన్ని సంపూర్ణం చేసుకున్నారు.

**అరటి ఆకుల్లో అన్నప్రసాదం.. భక్తులకు ఆతిథ్య సౌభాగ్యం**

దర్శనానంతరం భక్తులు ఆలయ సన్నిధిలోని శ్రీ వకుళమాత అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అరటి ఆకుల్లో సంప్రదాయబద్ధంగా అన్నప్రసాద వితరణ చేపట్టడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తిరుమల తిరుపతి క్షేత్రంలో నెలకొన్న అన్నప్రసాద సేవా సంప్రదాయాన్ని తలపించే రీతిలో వాడపల్లి క్షేత్రంలోనూ భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి దర్శనంతో పాటు అన్నప్రసాదం స్వీకరించడం తమకు పూర్వజన్మ సుకృతమని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

**భక్తుల రాకతో ఆదాయంలో గణనీయమైన సమీకరణ**

శనివారం భక్తుల తాకిడి విశేషంగా ఉండటంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాల స్వీకరణ, అన్నప్రసాద వితరణలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు మాట్లాడుతూ, శనివారం ఒక్కరోజే 80 వేల మందికి పైగా భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారని వెల్లడించారు. భక్తుల రాకతో ఆలయానికి ఒక్కరోజులోనే రూ.55 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

భక్తి విశ్వాసాలకు ప్రతీకగా, మొక్కులు తీర్చే పుణ్యక్షేత్రంగా వాడపల్లి వెంకన్న సన్నిధి దినదినాభివృద్ధి చెందుతుండగా, ప్రతి శనివారం భక్తజన ప్రవాహం క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని మరింత ఇనుమడింపజేస్తోంది.



# స్థానిక ఎన్నికలకు జనసేన వ్యూహరచన.. ప్రత్తిపాడులో సమన్వయ యంత్రాంగం సిద్ధం

**40 మందితో సమన్వయ, నిర్వహణ, సహాయక బృందాల నియామకం**



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 10:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీని సన్నద్ధం చేసే దిశగా పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల సన్నాహకంలో భాగంగా క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి, సంబంధిత పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీకి అందించేందుకు ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీని నియమించారు.

**అసెంబ్లీ సమన్వయకర్తలుగా ముగ్గురు**

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా మెడిశెట్టి సూర్య కిరణ్, గొర్లి నాగేశ్వరరావు, వరుపుల సుబ్బారావులను నియమించారు. వీరు నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలాబలాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల సమాచారాన్ని సమన్వయం చేయనున్నారు.

**32 మందితో నిర్వహణ బృందం**

నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు 32 మందితో నిర్వాహక దళాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో పెంటకోట మోహన్, కొప్పన వీర రాఘవరావు, వజ్రంగి శ్రీనుబాబు, దొడ్డి శ్రీనివాస్, ఎస్. జయబాబు, రావూరి వెంకటేశ్వరరావు, అమరాది సాంబశివరావు, మర్లపూడి శేఖర్, తలపంటి అప్పారావు, కుండల సాయి మనీంద్ర, గొర్లి రాజాబాబు, అచ్చె గోవిందు, గంగిరెడ్డుల బాలాజీ, జు. సరస్వతి, పబ్బు శివకుమార్, కె. వీర పద్మరాజు, ఎస్. వీర వెంకట సత్యనారాయణ, పక్కుర్తి సతీష్, తుమ్మల సత్యేంద్రనాథ్, కాక్రా రమేష్‌బాబు, బండేలా సత్యనారాయణ, ఉమ్మాది వెంకటలక్ష్మి, మేకల కృష్ణ, కలరి శ్రీను, గొల్ల కొండరావు, పెదిరెడ్ల వెంకటరాజీవ్, మాదెం సింహాద్రి, దొండా రాజమణి, అవల వి.వి. సత్య నారాయణ, కీర్తి కుమార్, నల్లాల రామకృష్ణ, కొరుప్రోలు రమేష్ ఉన్నారు.

**ఐదుగురితో సపోర్ట్ టీం**

ఎన్నికల సమన్వయ కార్యకలాపాలకు సహకారం అందించేందుకు ఐదుగురితో సపోర్ట్ టీంను నియమించారు. ఈ బృందంలో యర్రా వీరబాబు, కోలా నాగబాగు, సోమిరెడ్డి కుప్రాజు, సీరం వీర వెంకట సత్యనారాయణ, రామకుర్తి కామేశ్వరరావులకు చోటు కల్పించారు.

క్షేత్రస్థాయి సమాచార సేకరణకు ప్రాధాన్యం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పరిస్థితులను అంచనా వేయడం, స్థానిక సమస్యలు, ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా పనిచేయనుంది. సేకరించిన సమాచారాన్ని పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీకి అందించడం ద్వారా ఎన్నికల వ్యూహరచనకు అవసరమైన వివరాలను సమకూర్చనున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేన పార్టీ స్థానిక ఎన్నికల సన్నాహకాలను క్రమబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ కమిటీ కృషి చేయనుంది.

# దళిత ప్రజా సమితి కాకినాడ జిల్లా పగ్గాలు మడికి శివకు.. నియామకంపై హర్షం...

**ఏలూరు వేదికగా దళిత ప్రజా సమితి నాలుగవ వార్షికోత్సవ వేడుకలు....**




**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 10:-** దళిత ప్రజా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షులుగా మడికి శివ నియమితులయ్యారు. దళిత ప్రజా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కాపుదాసి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమితి నాలుగవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ నియామకానికి సంబంధించిన ప్రకటన వెలువడినట్లు సమాచారం.మడికి శివను కాకినాడ జిల్లా అధ్యక్షులుగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో దళిత ప్రజా సమితి జిల్లాలో మరింత బలోపేతం కావాలని, దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

దళిత ప్రజా సమితి లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలోని దళితులు, అణగారిన వర్గాల ప్రజలను ఐక్యం చేయడం, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయడం, సామాజిక సమానత్వం కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు అభిప్రాయపడ్డారు.

నాలుగవ వార్షికోత్సవ వేడుకలు సమితి కార్యకలాపాలను సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలిచాయి. మడికి శివకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై హర్షం వ్యక్తం చేసిన వారు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సమితి ఉపాధ్యక్షులు గుడిపూడి రమేష్ కుమార్ ,దళిత ప్రజా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గునపర్తి అపురూప్,ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు బత్తుల అశోక్,ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బోడ గంగాధర్ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ మద్ద ప్రేమ్ కుమార్,జాన్ విక్టర్, మాల సేన అధ్యక్షులు ఏరికిపాటి విజయ్ ,బహుజన సేన అధ్యక్షులు మత్తె బాబీ పలువురు దళిత ఉద్యమ నాయకులు,కాపు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి శేషు,సేవకులు గెరా అబ్రహం,మద్దా స్వరూప్ రాజ్ ,కాకర్ల రతన్ కుమార్,కాకర్ల వివేక్, కాగిత డేవిడ్ రత్నం, తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలి

**నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్యానికి విఘాతకరం: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్**



**ఆలమూరు పెన్ పవర్ అక్టోబర్ 10 :**దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ పేర్కొన్నారు. ఆలమూరు మండలం జొన్నాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి అత్యున్నత సంస్థలపై నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వాటిని వ్యక్తం చేసే క్రమంలో బాధ్యతాయుతమైన వైఖరిని అనుసరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో 42 మంది విశ్రాంత న్యాయమూర్తులు వ్యక్తం చేసిన ఆందోళనను ప్రస్తావిస్తూ, రాజ్యాంగ సంస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసం సడలకుండా రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని హితవు పలికారు.ఎన్నికల నిర్వహణలో ఏవైనా అవకతవకలు జరిగాయని భావిస్తే, అందుకు సంబంధించిన ఆధారాలను సమర్పిస్తూ ఎన్నికల సంఘాన్ని లేదా న్యాయస్థానాలను ఆశ్రయించాలని సత్తిబాబు గౌడ్ సూచించారు. చట్టబద్ధమైన మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు.

రాజకీయ భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం, చట్టపాలన పట్ల నిబద్ధత ప్రతి ఒక్కరికీ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య సంస్థల ప్రతిష్ఠను కాపాడేందుకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# 25వ రోజుకు చేరిన విఆర్ఏల నిరసన

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**మండల కేంద్రమైన ఆలమూరు తాహసిల్దార్ కార్యాలయం ఎదుట గల ధర్నా చౌక్ లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేస్తున్న నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం శనివారం 25వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా మండల విఆర్ఎల సంఘం అధ్యక్షులు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన విఆర్ఎ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘ సెక్రటరీ కె.శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, ట్రెజరర్ కుందేటి శ్రీను సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిది వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మీ, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మీ, షేక్ బషీర్ బిబి, తదితరులు పాల్గొన్నారు.



### జిల్లాలో పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి

## చాటిచెప్పడమే సీఐఐ సదస్సు లక్ష్యం







**కాకినాడ జేఎన్టీయూలో ప్రాంతీయ సదస్సుకు పకడ్బందీ ఏర్పాట్లు**

**కాకినాడ,పెన్ పవర్, అక్టోబర్ 10**: జిల్లాలో విస్తారంగా ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాలను ప్రపంచానికి చాటిచెప్పి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ నెల 12న కాకినాడ జేఎన్టీయూలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రాంతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సు ద్వారా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల పరిస్థితులను పారిశ్రామికవేత్తలకు వివరించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.శనివారం కాకినాడ జేఎన్టీయూలో జరుగుతున్న సదస్సు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పారిశ్రామికవేత్తల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సభా వేదిక, స్టాళ్ల ఏర్పాటు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఉత్పత్తుల ప్రదర్శన, ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. సదస్సుకు వచ్చే ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో విశాఖపట్నంలో విజయవంతంగా నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సును ప్రస్తుతం కాకినాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేదిక ద్వారా జిల్లాలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలను పారిశ్రామికవేత్తలకు వివరించనున్నట్లు చెప్పారు. సదస్సులో ఆహ్వానిత ప్రతినిధులు ప్రారంభ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.సదస్సులో భాగంగా ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత స్థానిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు ప్రదర్శనను సందర్శించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గదర్శనం చేసేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాన్ని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు, రతన్ టాటా ఆవిష్కరణల కేంద్రం ద్వారా లభించే సలహాలు, బ్యాంకుల రుణ సదుపాయాలపై ఇక్కడ సమాచారం పొందవచ్చని వివరించారు.

జిల్లాలో భూముల లభ్యత, వ్యవసాయ, ఉద్యానవన పంటల ఆధారిత ఆహార శుద్ధి పరిశ్రమల అవకాశాలు, ఓడరేవులు, రైలు, రహదారి అనుసంధానత వంటి మౌలిక సదుపాయాలను పారిశ్రామికవేత్తలకు సమగ్రంగా వివరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బహుళ అంతస్తుల పారిశ్రామిక భవనాలు (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు) నిర్మించడంతోపాటు పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొత్త పరిశ్రమలు జిల్లాకు వస్తే స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సీఐఐ ప్రాంతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సహకారంతో తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.పోలీస్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ ఏర్పాట్ల పరిశీలన

సీఐఐ ప్రాంతీయ సదస్సుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కాకినాడ పోలీస్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ్. గణపతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఈ. రమణారెడ్డి, అదనపు ఎస్పీ ఎం. కిషోర్ కుమార్, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వింగ్స్, కాకతీయ పాఠశాలల్లో ఘనంగా ముందస్తు దసరా వేడుకలు

### నవదుర్గల అవతారాల్లో విద్యార్థినుల ఆకట్టుకునే ప్రదర్శనలు





**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:** మండల పరిధిలోని గొల్లపాలెం కాకతీయ పాఠశాల, కోలంక వింగ్స్ పాఠశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల అవతారాల్లో సంప్రదాయ దుస్తులు,ఆధ్యాత్మిక అలంకరణలతో ముస్తాబై చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి తొమ్మిది రూపాలను ప్రతిబింబిస్తూ విద్యార్థినులు చేసిన ప్రదర్శనలు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకోగా, విద్యార్థుల్లో పండుగ ఉత్సాహం వెల్లివిరిసింది. దసరా పండుగ విశిష్టతను, నవదుర్గల అవతారాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వింగ్స్ పాఠశాల కరస్పాండెంట్ దేగల రాంబాబు మాట్లాడుతూ, విద్యాబోధనతోపాటు విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పట్ల అవగాహన పెంపొందించేందుకు తమ పాఠశాలలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటువంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సంప్రదాయాల పట్ల గౌరవభావం పెరుగుతాయని పేర్కొన్నారు. కాకతీయ యూపీ స్కూల్ గొల్లపాలెం ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌రాజు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సూచించారు. చదువుతోపాటు భారతీయ పండుగల విశిష్టతను తెలుసుకుని, మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దేగల వాణి, ప్రిన్సిపల్ టి. సతీష్, ఉపాధ్యాయులు పి.జానకి, జి. నవ్య, కడలి మార్కండేశ్వరి,డి.అక్షర పల్లవి,పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై పశు దాణా పంపిణీ



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**ఆలమూరు పశు సంవర్ధక కార్యాలయం వద్ద శనివారం 20 శాతం ప్రోటీన్లు కలిగిన పశువుల దాణాను (పెల్లెట్స్ దాణా) రైతులకు 50 శాతం సబ్సిడీతో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 50 కేజీల పశువుల దాణా బస్తా ఖరీదు బహిరంగ మార్కెట్లో రూ.1,110లు ఉంటే రైతులకు రూ.550లకే ప్రభుత్వ సబ్సిడీతో అందించినట్లు అమలాపురం పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.ఎల్.అనిత, ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.బి.వి.వి సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అధికారులు, పాల్గొన్నారు.

## చెముడులంకలో ఉచిత మెగా వైద్య శిబిరం.

247 మందికి ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 10:**ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలోని శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణమండపంలో శనివారం ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నేతృత్వంలో ఉచిత మెగా వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ట్రస్ట్ చైర్మన్ బూసి విద్యా ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకట రత్నం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ఉచిత శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాజమండ్రికి చెందిన ప్రముఖ ఆసుపత్రులైన శ్రీకర మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, శ్రీ రమా దంత వైద్యశాలల నిపుణులైన వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు గుండె, ఎముకలు-కీళ్లు, కంటి మరియు దంతాలకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

**మహిళలకు ప్రత్యేక పరీక్షలు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ:**

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ లేడీ డాక్టర్లచే ఉచిత వైద్య పరీక్షలు చేయించారు.శిబిరంలో పాల్గొన్న రోగులందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు ప్రకటించడంతో పాటు, అవసరమైన వారికి 50% రాయితీపై కళ్లజోళ్లను త్వరలోనే అందజేస్తామన్నారు.ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 247 మంది రోగులు పాల్గొని ఉచిత వైద్య సేవలను, పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు.ఈ సేవా కార్యక్రమంలో నాగిరెడ్డి సత్యానందం, వడ్డి దొరయ్యానాయుడు, దూలం వీర వెంకట గనిరాజు, అడబాల వీర్రాజు, గుండుబోగుల రాంబాబు, ఎన్ఆర్ఐ రాయుడు వెంకటేశ్వరరావు,అడ్డాల సత్యనారాయణ రాజు, న్యాయవాదులు కె.ఎస్. బాపిరాజు, ముప్పిరి వెర్రియ్య,తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరిస్తూ ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సేవలను కొనియాడారు.

# జనసేన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు నేతలకు చోటు









బేడే సతీష్, తీగల రవి, తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావుకు బాధ్యతలు

**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 10:**రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు చోటు లభించింది. బేడే సతీష్, తీగల రవి, తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావులను కమిటీ సభ్యులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించడం, అభ్యర్థుల ఎంపికలో సహకరించడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఈ కమిటీ కీలకంగా వ్యవహరించనుంది. చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో అవకాశం కల్పించడంపై మండలంలోని జనసైనికులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నలుగురు నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి జనసేన పార్టీ విజయానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

# హరిపురంలో రూ.3.85 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం





- విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దుతాం
- ఎంపీ శ్రీభరత్, గణబాబు

**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 10:**నగరంలోని శ్రీహరిపురం ఎంఐజీ కాలనీ (వుడా కాలనీ)లో రూ.3.85 కోట్ల జీవీఎంసీ సాధారణ నిధులతో నిర్మించిన అత్యాధునిక ఇండోర్ ట్రై నింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణ బాబు శనివారం ప్రారంభించారు. 60వ వార్డు పరిధిలో నిర్మించిన ఈ క్రీడా సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా వారు శిలాఫలకా న్ని ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన వుడెన్ కోర్టులో షటిల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. చిన్నా రుల కరాటే, బాక్సింగ్ ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు.

**క్రీడాకారులకు మెరుగైన వసతులు**

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, గతంలో శిథిలావస్థకు చేరిన భవనం కారణంగా స్థానికులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటు న్న భద్రతాపరమైన సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు, యువతకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడం అభినందనీయమన్నా రు. స్థానిక ఎమ్మెల్యే గణబాబు చొరవతో ఈ ప్రాంతంలో ఆధునిక క్రీడా సముదాయం అందు బాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నా రు.విద్యార్థినులు, బాలికలు కరాటే, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ పొందడం ద్వా రా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చ న్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా నాణ్యమైన క్రీడా శిక్షణ పొందేందుకు ఈ కాంప్లెక్స్ దోహదపడుతుందని చెప్పారు. నాలుగు వుడెన్ కోర్టులు, ఏసీ డార్మిట రీతోపాటు బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, కబడ్డీ వంటి క్రీడలకు అవసరమైన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు.కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, వసతులు దెబ్బతినకుండా స్థానిక కాలనీ అసోసియేషన్, సంబంధిత అధికారులు బాధ్యతగా నిర్వహిం చాలని శ్రీభరత్ సూచించారు. విశాఖపట్నాన్ని రాష్ట్ర క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులే లక్ష్యం**

ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ఈ కాం ప్లెక్స్ కేవలం క్రీడలు ఆడుకునే ప్రాంగణం మాత్ర మే కాదని, చిన్న వయసు నుంచే నాణ్యమైన శిక్షణ అందించి జాతీయ, అంతర్జాతీయ స్థా యిలో పతకాలు సాధించే క్రీడాకారులను తీర్చి దిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం అని వివరించారు. 2014--19 టీడీపీ ప్రభుత్వ హ యాంలోనే ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని, అనంతరం నిలిచిపో యిన పనులను కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత వేగవంతం చేసి పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా జట్లకు 10 నుంచి 15 రోజులపాటు శిక్షణ శిబి రాలు నిర్వహించేందుకు అవసరమైన సదుపా యాలను సమకూర్చినట్లు చెప్పారు. ఒకేసారి 50 నుంచి 60 మంది క్రీడాకారులు బస చేసేం దుకు వీలుగా డార్మిటరీ ఏర్పాటు చేశామన్నా రు. ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖపట్నాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్ క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు, ఎంఐజీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కూటమి గెలుపుకై నేతలకు దిశ నిర్దేశం

- అరకు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర.
- రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 10.**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సియ్యారి దొన్ను దొర, ఆంధ్రప్రదేశ్ జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్ కూటమి నేతలకు పిలుపునిచ్చారు. అరకు నియోజకవర్గం, ముంచంగిపుట్టు మండలం, బూసిపుట్టు పంచాయతీ పరిధిలో కూటమి నాయకులతో కార్యకర్తలతో శనివారం విస్తృత స్థాయి సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని కూటమి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఓటరునూ కలిసి కూటమి విజయానికి మద్దతు కూడగట్టాలని, ప్రతి గ్రామంలోనూ బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలన్నారు. ఓటర్లతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండాలని, స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కనబెట్టి సమిష్టిగా శ్రమించాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించాలని కూటమి శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి కామేష్, పిఎసిఎస్ చైర్మన్లు సామల బాబుజి, ప్రసాద్, టీడీపీ మండల కార్యదర్శి కె జాగ్రత్రాయ్, మాజీ సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి, మాజీ సర్పంచులు వి లక్ష్మణ్, ముత్యాలమ్మ, క్లస్టర్ ఇంచార్జ్ బిరామారావు, యూనిట్ ఇంచార్జ్ లైకోన్, బలరాం, కూటమి నాయకులు సింహాచలం, తిరుపతిరావు, ప్రసాద్, సురేష్, గాసిరం, అచ్చిబాబు, కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జనసేన అరకు పార్లమెంటు నిర్వాహక దళ సభ్యుడిగా నీటిపల్లి శ్రీను ఎన్నిక.



**చింతపల్లిపెన్ పవర్ అక్టోబర్ 10.** జనసేన పార్టీ అరకు పార్లమెంటు నిర్వాహక దళ సభ్యుల ఎంపిక కార్యక్రమం అరుకులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లికి చెందిన నీటిపల్లి శ్రీను నిర్వాహక దళ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సమన్వయకర్తలు శ్రీ కొణిదెల నాగబాబు, శ్రీ నెమ్మక జయకృష్ణ, శ్రీ వంపూరి గంగులయ్య ఆధ్వర్యంలో ఈ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అరకు పార్లమెంటు పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, పార్టీ అభివృద్ధికి కృషి చేయడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.చింతపల్లికి చెందిన నీటిపల్లి శ్రీనుకు ఈ బాధ్యత దక్కడంపై జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఓట్లు తొలగింపుపై సీఈసీ రాజీనామా చేయాలి

నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్‌లో సీపీఎం నిరసన




**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 10 :**ఓటర్ల జాబితా నుంచి భారీ సంఖ్యలో ఓట్లు తొలగించడాన్ని నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించా రు. జీవీఎంసీ పరిధిలోని 59వ వార్డు కొత్త వార్డు నంబర్ 81 పరిధిలో నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్ వద్ద ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నినా దాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మల్కా పురం జోన్ నాయకుడు బూడి శ్రీను మాట్లాడు తూ, భారత పౌరుల ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదని అన్నారు. ఓటర్ల జాబి తా నుంచి పేర్లను తొలగించే విషయంలో నిబం ధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. రాజకీయ కక్షతో ఓటు హక్కును హరించడం ప్ర జాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శిం చారు.దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ బాధ్యత వహించకుండా వ్యవహరించడం సరి కాదని బూడి శ్రీను అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎ స్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు హక్కుకు అన్యాయం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజ లు బీజేపీ ప్రభుత్వానికి, సంబంధిత అధికారుల కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించా రు.

ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. జె. రాము నాయుడు, జి. రామకృష్ణ, సీహెచ్. పైడి నాయుడు, ఎన్. దుర్గారావు, బి. కుమార్, ఆర్. శంకర్రావు, ఎం. శ్రీను, పవన్, సతీష్, సుభాన్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ముగింపు



- ఆరు స్వర్ణాలతో నార్తర్న్ రైల్వేకు టైటిల్
- దక్షిణ తీర రైల్వేకు చెందిన జి. నిహారికకు ప్రత్యేక పురస్కారం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 10:** విశాఖపట్నంలోని రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ (=xూజు)లో నాలుగు రోజుల పాటు జరిగిన 80వ పురుషుల, 19వ మహిళల అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపియన్‌షిప్--2026 శనివారం ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో ఆరు స్వర్ణ పతకాలతో నార్తర్న్ రైల్వే ఓవరాల్ టీమ్ ఛాంపి యన్‌గా నిలవగా, ఐదు స్వర్ణ పతకాలతో ఈస్ట ర్న్ రైల్వే రన్నరప్‌గా నిలిచింది. దక్షిణ తీర రైల్వే కు చెందిన జి. నిహారిక ఉత్తమ వర్ధమాన మహి ళా బాక్సర్ అవార్డును అందుకుంది.దక్షిణ తీర రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 7 నుంచి 10 వరకు నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 16 రైల్వే జోన్లకు చెందిన 142 మంది బాక్సర్లు పాల్గొన్నా రు. వీరిలో 86 మంది పురుషులు, 56 మంది మహిళలు ఉన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటైన తర్వాత దక్షిణ తీర రైల్వే నిర్వహించిన తొలి ప్రధాన జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్‌గా ఈ పోటీలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

ముగింపు కార్యక్రమానికి దక్షిణ తీర రైల్వే జన రల్ మేనేజర్ సందీప్ మాథుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎల్.వి. వి.ఎస్. పాత్రుడు, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇం జినీర్ టి.కె. సిన్హా అతిథులుగా పాల్గొన్నా రు.ఈ సందర్భంగా సందీప్ మాథుర్ మాట్లాడు తూ, ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వ హించిన నిర్వాహకులను, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి భారతీయ రైల్వేలు అందిస్తున్న సేవలను ప్రస్తావించారు. 1945లో ప్రారంభమైన పురుషుల అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపి యన్‌షిప్ 80వ ఎడిషన్‌కు, 2007లో ప్రారంభ మైన మహిళల ఛాంపియన్‌షిప్ 19వ ఎడిషన్ కు చేరుకోవడం విశేషమన్నారు.ఇలాంటి పోటీ లు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం తోపాటు, వారి నైపుణ్యాలను మెరుగుపరచడా నికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడానికి దోహదపడతాయని పేర్కొ న్నారు. నాలుగు రోజుల పాటు బాక్సర్లు ప్రదర్శిం చిన క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని ఆయన ప్రశంసించారు. ఇటీవల ప్రపంచకప్‌లో పాల్గొన్న నమన్ తన్వర్, నిఖిల్ దూబే, అన్మోల్‌లను అభినందించారు. నమన్ తన్వర్, నిఖిల్ దూబే కామన్వెల్త్ క్రీడల్లోనూ భా రత్‌కు ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు.ఛాంపియన్‌షిప్ నిర్వహణలో సహకరించిన రాజశీ=ూూ బృందం, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, రిఫరీలు, న్యాయనిర్ణేత లు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది, స్వచ్ఛంద సేవకుల సేవలను జనరల్ మేనేజర్ అభినందిం చారు. భవిష్యత్తులో జరిగే జాతీయ, అంతర్జాతీ య పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు.డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ, క్రీడాకారు లకు ఉద్యోగావకాశాలు, శిక్షణ సదుపాయాలు, సంస్థాగత సహకారం అందించడం ద్వారా క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంలో భారతీయ రైల్వే లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్రీడాకారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, మెరుగైన శిక్షణ, క్రీడా మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ క్రీడా రంగంలో దక్షిణ తీర రైల్వే తనదైన గుర్తిం పును సాధించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ మం చి వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.అనంతరం సందీప్ మాథుర్, లలిత్ బోహ్రా విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు, పతకాలు, ధ్రువపత్రాల ను అందజేశారు. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు కార్యవర్గ సభ్యులు, ఈవెంట్ నిర్వాహకులు, బాక్సింగ్ సంఘం ప్రతినిధులకు స్మారక చిహ్నాల ను ప్రదానం చేశారు.

**తుది ఫలితాలు**

ఓవరాల్ టీమ్ ఛాంపియన్: నార్తర్న్ రైల్వే -- 6 స్వర్ణ పతకాలు,ఓవరాల్ టీమ్ రన్నరప్: ఈస్టర్న్ రైల్వే -- 5 స్వర్ణ పతకాలు,ఉత్తమ పురుష బాక్సర్: కె. సంజీత్ సింగ్ -- ఈస్టర్న్ రైల్వే,ఉత్తమ వర్ధమాన పురుష బాక్సర్: ఆశిష్ -- నార్తర్న్ రైల్వే,ఉత్తమ మహిళా బాక్సర్: నకిత కుమారి -- నార్త్ ఫ్రంటియర్ రైల్వే,ఉత్తమ వర్ధమాన మహిళా బాక్సర్: జి. నిహారిక -- దక్షిణ తీర రైల్వే ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ముగియడం తో నిర్వాహకులు, క్రీడాకారులు, అధికారులు, సహకరించిన సిబ్బందిని దక్షిణ తీర రైల్వే అభి నందించింది. ఈ పోటీలు కొత్త రైల్వే జోన్‌కు జాతీయ స్థాయిలో క్రీడా రంగంలో గుర్తింపు తెచ్చే దిశగా కీలక ముందడుగుగా నిలిచాయి.

## త్రిశూల్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన

వాహనాలకు ఇన్సూరెన్స్, అవసరమైన పత్రాలు తప్పనిసరి: ఎస్సై కే. సురేష్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10**: ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా రహదారి భద్రతపై గూడెంకొత్తవీధి మండల ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లకు ఎస్సై కే. సురేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్లు అందజేశారు.ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా వాహన ఇన్సూరెన్స్‌తో పాటు అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జీవిత బీమా ప్రాధాన్యతపై కూడా అవగాహన కల్పించారు.అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. రహదారి భద్రతను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆటో డ్రైవర్లకు ఎస్సై కే. సురేష్ పిలుపునిచ్చారు.

## కాఫీ తోటలో ప్రమాదం.. గాయపడిన కార్మికుడికి టీడీపీ నేతల పరామర్శ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10:**మండలంలోని చాపరాతిపాలెంలో కాఫీ తోట పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి తలకు తీవ్ర గాయాలైన రాట రవికుమార్‌ను సంకాడ టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు పరామర్శించారు. శనివారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవల వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, బాధితుడికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడి చంటి, సంజీవరావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పాఠశాలల భవనాల నిర్మాణంలో నాణ్యత ఏదీ?



- గడువు తీరకుండానే కూల్చివేతలు..?
- ప్రజాధనం వృథాపై వైసీపీ నేతల ఆగ్రహం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన పాఠశాలల భవనాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు బొబ్బిలి లక్ష్మణ్, కుందేరి రామకృష్ణ ఆరోపించారు. నిర్మించి కొన్నేళ్లు గడవకముందే భవనాలు శిథిలావస్థకు చేరడం, కొన్ని చోట్ల కూల్చివేతలు చేపట్టడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణంగా భవనాలకు నిర్ణీత కాలపరిమితి ఉన్నప్పటికీ, నాలుగైదేళ్లకే పాఠశాల భవనాలు దెబ్బతినడం నిర్మాణ నాణ్యతపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. ఐదేళ్లు కూడా పూర్తికాకముందే పైకప్పుల నుంచి వర్షపు నీరు కారడం, పెచ్చులు ఊడి పడటం వంటి ఘటనలు విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణాల సమయంలో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించని అధికారులు, కాంట్రాక్టర్ల బాధ్యతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో అనేక పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్మించిన భవనాలు కూడా నాణ్యత లోపాలతో నిరుపయోగంగా మారడం ఆందోళనకరమన్నారు. ప్రతి పాఠశాల భవనం నిర్మాణానికి అయిన వ్యయం, నిర్మాణ సంవత్సరం, భవనం ప్రస్తుత స్థితి వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరారు. ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులు నిర్మాణ పనుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు కూడా భవన నిర్మాణాల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గిరిజన విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com